సాక్షి తిరుపతి

శుక్రవారం । 28 । జూన్ । 2024



ఉద్యోగుల భద్రతకు..

ఉద్యోగుల భద్రతకు ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ అవసరమని తిరుపతి జిల్లా ఈపీఎఫ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి తెలిపారు. - 8లో



కాట్రపల్లెలో డయేరియా భయం

సత్యవేడు నియోజకవర్గం, కేవీబీపురం మండలం, కాట్రపల్లె దళితవాడ వాసులు డయేరియాతో వణికిపోతున్నారు. - 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. - 8లో

ఏ మాత్రం చూడరు!

తిరుపతి జిల్లాలో మెడికల్ షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫార్మసిస్టులతో పని లేకుండా షాపులను నడిపేస్తున్నారు. విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్‌ను రోగులకు అంటగడుతున్నారు. సంబంధిత అధికారులు దుకాణ యజమానులిచ్చే మామూళ్లతో తనిఖీలకు స్వస్తి చెప్పేస్తున్నారు. చర్యలకు సైతం ముఖం చాటేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

- జిల్లాలో ఇష్టారాజ్యంగా మందులు, మాత్రల విక్రయం
- నిబంధనలకు తూట్లుపొడుస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులు
- ఫార్మసిస్టులు, ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు
- నిద్రమత్తులో జోగుతున్న సంబంధిత అధికారులు



తిరుపతి తుడా: జిల్లా వ్యాప్తంగా మొత్తం రెండు వేలకుపైగా మెడికల్ షాపులున్నాయి. ఇవిగాక గ్రామాల్లో దాదాపు 920కు పైగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా ఆస్పత్రి కొత్తగా ఏర్పాటు చేస్తున్నారంటే దానికి అనుసంధానంగా మందుల దుకాణం పెట్టడానికి పోటీపడిపోతున్నారు. జిల్లాలోని కొన్ని మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో మందుల దుకాణం ఏర్పాటుకు పోటీదారులు లక్షల రూపాయలు గుడ్ విల్ ఇచ్చేందుకు వెనుకాడడం లేదంటే అతిశయోక్తి కాదేమో. మందుల దుకాణాల నిర్వహణపై ఔషధ నియంత్రణశాఖ సహాయక సంచాలకుడి పర్యవేక్షణతో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ ఉండాల్సి ఉన్నా.. వీరు నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మందుల దుకాణాలకు లైసెన్సులున్నాయా? సంబంధిత సరిఫికెట్ ఉన్న ఫార్మసిస్టే దుకాణం నిర్వహిస్తున్నారా? మందులిచ్చే వారికి అనుభవం ఉందా? లేదా? తదితర విషయాలపై పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అర్హత, అనుభవం లేని వ్యక్తులు నిర్వహించే మందుల దుకాణాల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది.

నిబంధనలు తూచ్

మందుల దుకాణాల్లో ఫార్మసిస్టులు మాత్రమే మందులివ్వాల్సి ఉంటుంది. దుకాణం నిర్వహిస్తున్న సమయాల్లో ఆయన పర్యవేక్షణలోనే మందుల విక్రయాలు జరగాలి. కానీ చాలావరకు రిటైల్ దుకాణాల్లో ఫార్మసిస్టు ఉండడం లేదు. ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకుని దుకాణాలను నడుపుతున్నవారు వేలల్లోనే ఉన్నట్టు సమాచారం. ఎంబీబీఎస్ వైద్యులు సిఫార్సు చేసిన మందుల చీటీ ఆధారంగానే జలుబు, జ్వరం వంటి చిన్నచిన్న రోగాలకు సైతం మందులివ్వాలి ఉంటుంది. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే చిన్న పిల్లలు వెళ్లి అడిగినా మందు బిళ్లలిచ్చేస్తున్నారు. ఇక దుకాణాల్లో అమ్మే మందులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. తెచ్చే మందులకు, విక్రయించే మందులకు ఎలాంటి రిజిస్టర్లు అమలు కావడం లేదు. ఎవరైనా రీయింబర్స్‌మెంట్ కోసం కొనుగోలు చేసేందుకు బిల్లులు అడిగితే ఎమ్మార్పీ, దానిపై జీఎస్టీ వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఏ దుకాణానికీ జీఎస్టీ కూడా లేకపోవడం విశేషం.

చర్యలు తప్పవు

మందుల దుకాణదారులు కచ్చితంగా నిబంధనలను పాటించాలి. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు. రెగ్యులర్‌గా మందుల షాపులను తనిఖీలు చేస్తున్నాం. మందుల షాపులో కచ్చితంగా ఫార్మాసిస్టులు ఉండి తీరాల్సిందే. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించినట్లు తెలిస్తే తీవ్ర చర్యలు ఎదుర్కోకతప్పదు. అలాంటి మందుల దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం. వైద్యుల సిఫార్సు లేకుండా యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ విక్రయించడం నేరం. అలా ఎవరైనా విక్రయించినట్లు సమాచారం ఇస్తే ఆ దుకాణాలను సీజ్ చేసి భారీ జరిమానా విధిస్తాం. **– హరిప్రసాద్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ, తిరుపతి**

న్యూస్‌రీల్

వన్‌వేలు పటిష్టం



ట్రాఫిక్ ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: తిరుపతిలో ఏర్పాటు చేసిన వన్‌వేలను ప్రతిఒక్కరూ కఠినంగా అమలు చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని ప్రధాన సర్కిళ్లు, వన్వేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నగరంలోని గాంధీరోడ్డు, చిన్న బజారువీధి, తిట్టకట్ట వీధి, బండ్లవీధి, కరణాలవీధి, భేరివీధి ప్రాంతాల్లో వన్వేలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. పూల మార్కెట్ సమీపంలో ఇరువైపులా ఉన్న అడ్డంకులను తొలగించి పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గోవిందరాజ గుడి సమీపంలోని ఉత్తరమాల వీధి ప్రాంతాలలో పార్కింగ్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఎక్కువగా ఉందని, ఆయా ప్రాంతాలన్నిటినీ పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని చెప్పారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. పంచముఖ ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న కృష్ణాపురం ఠాణా జంక్షన్, నిత్యం రద్దీగా ఉండే గాంధీ రోడ్డు పూలమట్టం, గోవిందరాజు స్వామి దక్షిణమాల వీధి, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో అవసరమైన చోట్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్, తిరుపతి డీఎస్పీ రవి మనోహరాచారి, సీఐలు ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 77,332 మంది స్వామివారిని దర్శించుకోగా 30,540 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.38 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పీఎంశ్రీ స్కూళ్లలో ఒకేషనల్ విద్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అమలవుతున్న పీఎంశ్రీ పాఠశాలల్లో ఒకేషనల్ విద్యను అమలు చేయనున్నట్లు రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసులురెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు 2024–25 విద్యాసంవత్సరంలో అమలు చేసే ఒకేషనల్ విద్య పాఠశాలలను పర్యవేక్షించే బాధ్యతను సమగ్రశిక్ష జీసీడీఓకు అప్పగించారు. ఒకేషనల్ విద్య అమలు చేసే పాఠశాలల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అత్యంత ప్రాధాన్యతగా డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీలు ఈ ప్రక్రియను అమలు చేయాలని అందులో ఆదేశించారు.

జూనియర్ రీసెర్చ్ ఫెలోకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో డీఆర్‌డీఓ స్పాన్సర్డ్ ప్రాజెక్ట్ అయిన డెవలప్‌మెంట్ ఆఫ్ నానో ఎన్ క్యాప్సిలేటెడ్ నాచురల్ యాంటీ మైక్రోబయాల్స్ ఫర్ ఫుడ్ ప్రిజర్వేషన్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేయడాని దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్స్ ప్రొఫెసర్ కళారాణి, ప్రొఫెసర్ ఉమామహేశ్వరి దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా ఈమెయిల్ ద్వారా పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్

తిరుపతి రూరల్: సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో 'విద్యుత్ భద్రత–రాజీ పడకండి, తెలివిగా ఉండండి' అనే నినాదంతో పలు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. గృహ విద్యుత్ కనెక్షన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వైర్లను కరెక్ట్‌గా కనెక్ట్ చేయకపోతే షార్ట్ సర్క్యూట్ అయి తీవ్ర నష్టం కలుగుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి బాలసుబ్రమణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవుల కోసం దిగజారను

- వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూమన అభినయ్‌రెడ్డి వెల్లడి



భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: పదవుల కోసం దిగజారే తత్వం తనది కాదు అని, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, నాలుగో డివిజన్ కార్పొరేషన్ పదవికితాను ఎప్పుడో రాజీనామా చేశానని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ భూమన అభినయ్ తెలిపారు. తన పదవుల రాజీనామాల విషయాన్ని గోప్యంగా ఉంచారంటూ ఓ పత్రికలో రాయడంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన రాజీనామాల విషయాలను గురువారం మీడియాకు వెల్లడించారు. వైఎస్‌ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు ఖరారైన వెంటనే, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిగా ఆ పదవులకు రాజీనామా చేశాకే ఎన్నికలకు వెళ్లానన్నారు. తాను తన పదవులకు రాజీనామా చేసిన విషయం ఎన్నికలకు ముందు అన్ని పత్రికల్లో కూడా వచ్చిందన్నారు. తాజాగా ఒక పత్రికలో తన రాజీనామాల విషయాన్ని గోప్యంగా ఉంచానని రాయడం దుర్మార్గంగా అనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజీనామాలకు మేయర్ డాక్టర్ శిరీషతోపాటు మున్సిపల్ శాఖ అధికారులు కూడా ఆమోదం తెలిపారన్నారు. ప్రజాతీర్పును గౌరవించి కొత్తగా ఎన్నికైన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకి తాను శుభాకాంక్షలు కూడా తెలియజేశానన్నారు. డిప్యూటీ మేయర్ పదవిని తిరుపతి రూపురేఖలు మార్చడానికి సద్వినియోగం చేసుకున్నానని చెప్పారు. తాను పుట్టి పెరిగిన తిరుపతికి ఏదైనా మంచి చేయడం కోసమే డిప్యూటీ మేయర్ పదవిని ఉపయోగించుకున్నానని, దాన్ని అలంకారంగా తానెప్పుడూ వాడుకోలేదన్నారు. తన రాజీనామా లేఖను బయట పెట్టొద్దని ఒత్తిడి చేశానని రాయడం వారి ఆలోచనల సంకుచిత మనస్తత్వాన్ని బయట పెడుతున్నదని, అందులో నిజం లేదన్న విషయం అందరికీ తెలుసునన్నారు. రాజీనామాపై గోప్యత పాటించడం వెనుక అనుమానాలున్నాయని రాయడాన్ని పచ్చ కామెర్లోళ్లకి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్నట్టుగా చూడాల్సి ఉంటుందన్నారు. ప్రజాతీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినప్పటికీ హుందాగా స్వీకరించానే తప్ప డిప్యూటీ మేయర్ పదవి కోసం కక్కుర్తి పడే స్వభావం తనది కాదని స్పష్టం చేశారు. తిరుపతి వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో పుట్టడం, ఈ నగరానికి డిప్యూటీ మేయర్‌గా రెండేళ్లపాటు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, రాబోయే రోజుల్లో ప్రతిపక్ష నాయకుడిగా తిరుపతి ప్రజాసమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

అధైర్యపడొద్దు..

అండగా ఉంటాం



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- కార్యకర్తలపై దౌర్జన్యాలను సహించేది లేదు
- అవసరమైతే కోర్టులను ఆశ్రయిస్తాం
- నేదురుమల్లి, కిలివేటి, మేరిగ వెల్లడి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండి అండగా ఉంటామని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఎమ్మెల్సీ మేరిగ మురళి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ఫలితాలు వెలువడిన గంటల వ్యవధిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్షపూరితంగా దాడులకు పాల్పడడం, వైఎస్సార్‌సీపీ భవనాలు, శిలాఫలకాలు, వైద్యశాలలు కూల్చివేయడం దారుణమన్నారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని, కానీ ప్రస్తుతం జరుగుతున్న దౌర్జన్యకాండ తీరు మార్చుకోక పోతే తిరుగుబాటుకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో అధికారుల నివేదికల ప్రకారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాలు నిర్మిస్తున్నామని, అయితే ఈ క్రమంలో రేణిగుంటలో నిర్మిస్తున్న భవనానికి నోటీలు జారీచేయడం సమంజసం కాదన్నారు. ఈ మేరకు తగిన పత్రాలతో కోర్టును ఆశ్రయించామని, మరో మూడు నెలల్లో భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే కోర్టులకు సైతం వెళ్లేందుకు వెనుకాడమన్నారు. టీడీపీ కూటమికి ప్రజలు ఇచ్చిన అధికారం హుందాగా ఉండాలని, లేని పక్షంలో ప్రజలు అన్నీ గమనిస్తుంటారని చెప్పారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీ మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలోని వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలు దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాం నాయకులు మమేకమై అభివృద్ధి బాటలో పయనిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఆ సంప్రదాయన్ని కొనసాగించాలని కోరారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్రంలో టీడీపీ అరాచకాలు మితిమీరిపోతున్నాయన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తూ న్యాయవ్యవస్థను ఆశ్రయిస్తామన్నారు. ప్రజాపక్షాన నిలబడి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. అనంతరం ఎస్వీబీసీ చైర్మన్, వెంకటగిరి రాజా కుటుంబీకులు డాక్టర్ వీబీ.సాయికృష్ణయాచేంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ మాజీ రీజనల్ కమిటీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, పీ.లక్ష్మి, బాలాయపల్లి, సైదాపురం మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, మన్నారపు రవికుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు నాగయ్య, సదారెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతోనే అధిక దిగుబడి

- పరిశోధనలతో రైతులకు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం
- పోషకాహార భద్రతలో మిల్లెట్స్‌దే ప్రధాన పాత్ర
- కోవిడ్ తర్వాత పౌష్టికాహారంపై విస్తృత అవగాహన
- పీడీఎస్‌లో భాగం చేస్తేనే చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతుంది
- అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సులో వక్తల పిలుపు



సదస్సును ప్రారంభిస్తున్న ఐసీఏఆర్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్ రాజ్‌శర్మ

తిరుపతి సిటీ: చిరుధాన్యాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణతతో పాటు ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా అడుగులు వేయాలని ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డెప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి వెటర్నరీ కళాశాలలో హైదరాబాద్ జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ, ఐసీఏఆర్, తిరుపతి ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులతోనే అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. నాణ్యమైన పరిశోధనలతో రైతులకు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఉత్పాదకతను పెంచేందుకు అన్ని పరిశోధనా సంస్థలు కృషి చేయాలన్నారు. దాదాపు 5వేల సంవత్సరాలుగా సజ్జ పంట సంప్రదాయ పంటగా కొనసాగుతోందని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్త చిరుధాన్యాల పంటల ఉత్పత్తిలో సజ్జ పంట ఉత్పత్తి సంగం ఉందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. నూతన వంగడాలపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరగాలన్నారు.

అలా చేస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుంది

ఆంగ్రో వర్సిటీ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో చిరుధాన్యాలను భాగం చేస్తే డిమాండ్ పెరిగి పంట సాగువిస్తీర్ణం పెరుగుతుందన్నారు. ఇప్పటికే ఏపీ పీడీఎస్ ద్వారా ప్రజలకు రాగులు వంటి చిరుధాన్యాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ప్రధానంగా చిత్తూరు జిల్లాలో ప్రభుత్వమే చిరుధాన్యాల పంటలను రైతుల నుంచి కొనుగోలు చేసి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందిస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒక్కోరకం చిరుధాన్యం సంప్రదాయ పంటగా సాగులో ఉందన్నారు. ఐసీఏఆర్ సహకారంతో రాష్ట్రంలోని నాలుగు పరిశోధనా స్థానాలలో చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తూ సాగుకు అనువైన ప్రదేశాలలో సాంకేతికతను జోడించి రైతులకు సహకరిస్తున్నామన్నారు. పోషకాహార భద్రతలో మిల్లెట్స్ పంటల పాత్ర అధికంగా ఉందన్నారు. కోవిడ్–19 తర్వాత మిల్లెట్స్ వినియోగం పెద్ద ఎత్తున పెరిగిందని తెలిపారు. రైతు పంట ఉత్పత్తి సంఘాల(ఎఫ్‌పీఓఎస్) ద్వారా చిరుధాన్యాల పంటలకు విలువ జోడించే (మద్దత్తు ధర) ప్రక్రియలో వర్సిటీ పురోగతి సాధించిందన్నారు. ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌కే ప్రధాన్ మాట్లాడుతూ జన్యు పరిశోధన ద్వారా అధిక పోషకాలిచ్చే జన్యు లక్షణాలను గుర్తించి నూతన వంగడాల తయారీలో ఉపయోగించవచ్చన్నారు. ప్రస్తుతం 30 నుంచి 40 మినిలియన్ టన్నుల చిరుధాన్యాల ఉత్పత్తి ఎగుమతికి అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో హైదరాబాద్ జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ.సత్యనారాయణ, అసోసియేట్ డీన్ డాక్టర్ రమణ, ఏడీఆర్ డాక్టర్ వీ.సుమతి, దేశ వ్యాప్తంగా పలు వర్సిటీల నుంచి 220 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎన్జీరంగా వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి

గురుదక్షిణామూర్తికి అభిషేకాలు



దక్షిణామూర్తికి హారతులిస్తున్న గురుకుల్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేకఅభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో దీక్షాగురుకుల్, వేద పండితులు, అర్చకులు గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన చేశారు. అనంతరం పాలు, పెరుగు, పంచామృతం, చందనం, విబూది, పసుపు, తేనె, నారికేళ్ల జలంతో అభిషేకాలు చేశారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో, స్వర్ణాభరణాలతో భక్తులు సమర్పించిన గుగ్గిళ్లు, మాలలు శోభాయమానంగా అలంకరించారు. వేదమంత్రాల మధ్య స్వామి వారికి పంచ హారతులైన పర్వత, చక్ర, కుంభ, మహా హారతులిచ్చారు. ఏఈఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, సుదర్శనం, సూపరింటెండెంట్ నాగభూషణం పాల్గొన్నారు.

ఒక్కో సచివాలయ ఉద్యోగికి 50 ఇళ్లు

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లాలో రూ.2.69 లక్షల మందికి రూ.182.33 కోట్లు

తిరుపతి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పేరును ఎన్టీఆర్ భరోసా పింఛన్‌గా ప్రభుత్వం మార్పు చేసినట్లు కలెక్టర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జూన్‌కు సంబంధించిన పింఛన్లు జూలై 1వ తేదీ నుంచి ఇంటింటికీ సచివాలయ ఉద్యోగులు వచ్చి అందిస్తారని చెప్పారు. గతంలో పింఛన్ కోసం వాడుతున్న కార్డులను వాడరాదని, కొత్తగా పింఛన్ స్లిప్పులను పంచాయతీ సెక్రటరీ అందిస్తారని తెలిపారు. ఒక్కో సచివాలయ ఉద్యోగికి 50 గృహాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు తదితర పింఛన్ల మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచినట్టు వెల్లడించారు. పెంచిన పింఛన్ రూ.4వేల తోపాటు ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి ఒక్కో వెయ్యి చొప్పున మొత్తం లబ్ధిదారునికి రూ.7 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. జిల్లాలో 2.69 లక్షల లబ్ధిదారులకు రూ.182.33 కోట్లు పంపిణీ చేస్తారన్నారు. మరోవైపు దివ్యాంగులు, క్షయ వ్యాధిగ్రస్తులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలు, పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలు, కిడ్నీ, లివర్, బైలేట్రల్ ఎలిఫెంటాసిస్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.5 వేల నుంచి రూ.10వేలు అందిస్తారని వివరించారు.

క్లుప్తంగా

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

● రూ.33,400 నగదు స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలో పేకాటాడుతున్న ఆరుగురిని అలిపిరి పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రామారావ్ వివరాల మేరకు.. రామచంద్ర మిషన్ ఎదురు వీధిలో ఉన్న పార్కు వద్ద నిర్మానుష్య ప్రాంతంలో పేకాటాడుతున్నట్లు సమాచారం వచ్చింది. పోలీసులు తమ సిబ్బంది దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా నగర వాసులే. వీరు చిరు వ్యాపారులు, డ్రైవర్లుగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.33,400 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించినట్టు సీఐ తెలిపారు.

రెచ్చిపోయిన చైన్‌స్నాచర్


బాధితురాలు మునెమ్మ

నాగలాపురం: చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. పట్టపగలు ఓ మహిళ మెడలో నుంచి చాకచక్యంగా బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. ఎస్ఐ ఓబయ్య కథనం.. మండలంలోని వినోభానగర్ గ్రామనికి చెందిన మునెమ్మ(55) ఉత్తుకోటైలోని సాయిబాబ గుడికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆమె స్వగ్రామానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు తన వినోభానగర్ బస్ స్టాపింగ్ వద్ద బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. విషయం తెలుసుకున్న చైన్‌స్నాచర్ బైక్‌లో ఆమెను వెంబడించాడు. ఆపై ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు


చికిత్స పొందుతున్న నిషార్ అహ్మద్

రేణిగుంట: ద్విచక్రవాహనాన్ని బస్సు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ విలేకరి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గాజులమండ్యం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. రేణిగుంటకు చెందిన ఓ పత్రికా విలేకరి నిషార్ అహ్మద్(44) గురువారం వ్యక్తిగత పనులమీద ద్విచక్రవాహనంలో పుత్తూరు వెళ్లాడు. పనులు ముగించుకుని రేణిగుంటకు తిరుగుపయనమవ్వగా.. గాజులమండ్యం దాటాక, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నిషార్‌అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని తిరుపతి రుయాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గాజులమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

కాట్రపల్లెలో డయేరియా భయం

● 15 మంది బాధితుల గుర్తింపు
● కొనసాగుతున్న ప్రత్యేక వైద్యశిబిరం


కాట్రపల్లెలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం, కాట్రపల్లి దళితవాడలో డయేరియా బాధితులు 15 మందిని అధికారులు గుర్తించారు. ఈ మేరకు గురువారం డీఎం అండ్ హెచ్‌ఓ శ్రీహరిరావు పర్యవేక్షణలో వైద్యసేవలు కొనసాగించారు. రెండు రోజులుగా అదే గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్యసేవలందిస్తున్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని కూడా గుర్తించి ముందస్తు వైద్యం అందజేస్తున్నారు. అంతేగాక డయేరియా వ్యాధి లక్షణాల గురించి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. తాగునీటి విషయంలో ప్రతిఒక్కరూ ప్రత్యేక చొరవ చూపి కాచిన నీటినే తాగాలని స్థానికులకు సూచించారు. వాంతులు, విరేచనాలు వస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలని కోరారు.



కేవీబీపురంలో మూతపడిన ఆర్‌ఎంపీ క్లినిక్

ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేసుకోవద్దు

డయేరియా బారినపడినవారు తొందరపాటుతో ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లి వైద్యం చేసుకోవద్దని జిల్లా డీఎం అండ్ హెచ్‌ఓ శ్రీహరిరావు సూచించారు. ఆయన కేవీబీపురం మండలంలోని పలు ఆర్‌ఎంపీ వైద్యశాలలను సందర్శించేందుకు వెళ్లగా ముందస్తు సమాచారం అందుకున్న ఆర్‌ఎంపీలు ఆస్పత్రులను తెరవకనే దాక్కున్నారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌ఓ మాట్లాడుతూ.. డయేరియా లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గానీ, ఏరియా ఆస్పత్రుల్లో గానీ సంప్రదించి వైద్యం చేసుకోవాలని కోరారు. కాట్రపల్లిలో వైద్యపరంగా అన్ని చర్యలు తీసుకున్నామని, కేసులు అదుపులోకి వస్తున్నట్లు పేర్కొన్నారు.


శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ

అతిసారం కట్టడికి పటిష్ట చర్యలు

శ్రీకాళహస్తి: అతిసారం కట్టడికి పటిష్ట చర్యలు తీసుకున్నామని వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. అతిసారం విజృంభించిన కేవీబీపురం మండలం కాట్రపల్లెలో గురువారం ఆర్డీఓ రవిశంకర్ రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఎవరైనా వాంతులు, విరోచనాలతో బాధ పడుతున్న పక్షంలో గ్రామంలోని వైద్య శిబిరం వద్ద చికిత్స పొందాలని కోరారు. గ్రామంలో అతిసారం వ్యాధి నియంత్రణలోనే ఉందని, సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నవారు బుధవారం శ్రీకాళహస్తి ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడిందన్నారు . గ్రామంలో వైద్య శిబిరాన్ని మరికొన్ని రోజులు కొనసాగించాలని వైద్యాధికారిని ఆదేశించారు.

వార్డుల్లో సౌకర్యాలు మెరుగుపరచండి

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ సందర్శించారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు ఉండటం, ఆసుపత్రిలో స్వచ్ఛ జలం లేకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన పర్యవేక్షణ లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డులో సౌకర్యాలు మెరుగు పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతిసారం బాధితులను పరామర్శించారు. ఆసుపత్రి చుట్టుపక్కల గ్రామాల నుంచి ఏడుగురు అతిసారంతో బాధపడుతూ ఇక్కడ చేరినట్టు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుల, డీపీఎంఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డీసీఎస్ హరిత, డీఎంఓ రూప్‌కుమార్, డెమో బాబు నెహ్రూరెడ్డి, డాక్టర్ తేజస్విని, ఎంపీహెచ్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


కేవీబీపురం మండలంలో పర్యటిస్తున్న ఆర్డీఓ, జిల్లా వైద్యాధికారి

ఉద్యోగుల భద్రతకు ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ సేవలు


బీమా సేవలపై ప్రసంగిస్తున్న ప్రేమ్‌లాల్, నాగమణి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఉద్యోగుల భద్రతకు ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ సేవలు ఎంతో అవసరమని తిరుపతి జిల్లా ఈపీఎఫ్ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రేమ్‌లాల్, ఈఎస్ఐసీ తిరుపతి బ్రాంచ్ మేనేజర్ నాగమణి అన్నారు. గురువారం శ్రీసిటీ వ్యాపార వాణిజ్య కేంద్రంలో వారి అధ్యక్షతన ‘నిధి ఆప్ కే నికట్ 2.0’ పేరిట ఉద్యోగుల భవిష్యనిధి, బీమా సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు శ్రీసిటీలోని వివిధ పరిశ్రమలకు చెందిన హెచ్‌ఆర్ ఏలు హాజరయ్యారు. సమావేశంలో ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ సేవల ప్రాముఖ్యత గురించి ప్రేమ్‌లాల్, నాగమణి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. భవిష్యనిధి, బీమా సేవల పరంగా ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యల సమగ్ర సమాచారాన్ని తెలియజేశారు. ఈ–నామినేషన్, యూఏఎన్ యాక్టివేషన్, కేవైసీ అప్‌డేటింగ్, బ్యాంక్ ఆధార్ సీడింగ్, ఆన్‌లైన్ ఈసీఆర్ ఫైలింగ్, ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకం, ఉద్యోగుల పెన్షన్ పథకాలకు సంబంధించి ఉద్యోగుల లేవనెత్తిన పలు సందేహాలను వారు నివృత్తి చేశారు. సంబంధిత పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. వేలాది ఉద్యోగులు పనిచేస్తున్న శ్రీసిటీలో వారి అవసరాలకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమాన్ని శ్రీసిటీలో నిర్వహించడంపై శ్రీసిటీ హెచ్‌ఆర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శివకుమార్ రెడ్డి ఈపీఎఫ్ఓ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పరస్పర సమాచార మార్పిడికి ఇది ఒక అద్భుతమైన వేదిక అని ఆయన అన్నారు. ఎంప్లాయర్ ఉద్యోగి ఫిర్యాదులను పరిష్కరించడానికి శ్రీసిటీలో ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ముగ్గురికి గాయాలు


గాయపడిన సౌందర్య, కన్నన్


తీవ్రంగా గాయపడిన రాజకుమారి

గుడిపాల: కారును ఈచర్ వాహనం ఢీకొనడంతో ముగ్గురు గాయపడినట్లు సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం నుంచి చిత్తూరుకు వస్తున్న టీఎన్06ఎమ్2832 నంబరు మారుతి వ్యాగనర్ కారును, చిత్తూరు నుంచి తుపత్తూరుకు వెళ్తున్న టీఎన్42ఎటి1006 నంబరు ఈచర్ వాహనం ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న చిత్తూరుకు చెందిన సౌందర్య(37), కన్నన్(44), రాజకుమారి(65) గాయపడ్డారు. ఇందులో రాజకుమారి తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంపీని అభినందించిన మాజీ ఎమ్మెల్యే


తిరుపతి ఎంపీ గురుమూర్తితో బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తిరుపతి పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన మద్దెల గురుమూర్తిని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనం వద్ద ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట శ్రీకాళహస్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్మల శ్రీనివాస్‌యాదవ్, ఐతేపల్లి గురునాథం, జీపీ.యాదవ్, ఎస్ఎంఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు ధనుష్ ఉన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో మహిళకు జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి ఎంఆర్ పల్లి, వాసవి నగర్‌లోని సిరి డెంటల్ కేర్ యజమాని డాక్టర్ ఎస్.పవిత్రకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరపు న్యాయవాది ఎం. మురళి తెలిపిన కేసులోని వివరాలిలా ఉన్నాయి. తిరుపతి, డీఆర్ మహల్ రోడ్డు, రాజారెడ్డి కాలనీకి చెందిన ఎం.మౌనిక వద్ద డాక్టర్ పవిత్ర 2019 ఏప్రిల్ 15వ తేదీ రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో ఆమె 2019 సెప్టెంబర్ 17న మౌనికకు రూ.1.50 లక్షలు విలువచేసే చెక్కును ఇచ్చారు. ఆమె ఆ చెక్కును బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. దీంతో మౌనిక కోర్టులో డాక్టర్ పవిత్రపై కేసు వేశారు. న్యాయమూర్తి పరిశీలించి డాక్టర్ పవిత్రకు జైలు శిక్ష విధించారు.

నిజాయితీ చాటిన అధికారులు


పోగొట్టుకున్న నగదును భక్తురాలికి అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ మధు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులు క్యూలో పోగొట్టుకున్న నగదును తిరిగి భక్తులకు అందించి నిజాయితీని చాటుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. కర్ణాటక రాష్ట్రం, ముళ్‌బాగిల్‌కు చెందిన జమున తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం ఆలయ ప్రసాద కౌంటర్ క్యూలో జమున తన పర్సును పోగొట్టుకుంది. పర్సును గుర్తించిన విజిలెన్స్ అధికారులు ఆలయ సూపరింటెండెంట్ మధు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆలయంలోని మైకు ద్వారా ప్రచారం చేయడంతో భక్తురాలు కార్యాలయానికి చేరుకుని పర్సు వివరాలను తెలియజేశారు. దీంతో పర్సుతో పాటు అందులోని రూ.28 వేల నగదు, బ్యాంకు క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు ఇతర పత్రాలను ఆమెకు అందజేశారు. ఆలయ సిబ్బంది, అధికారుల నిజాయితీకి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


ప్రిన్సిపల్ సెక్రటరీ రోహిణి సింధూరి

తిరుమల: శ్రీవారిని గురువారం కర్ణాటక ప్రిన్సిపల్ సెక్రటరీ రోహిణి సింధూరి, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ధర్మరాజు, కళా వెంకట్రావు, ధూళిపాళ్ల నరేంద్ర దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు.

సేవాభావానికి ప్రతిరూపం స్కౌట్స్ అండ్ గైడ్స్


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రమేష్, హెచ్‌ఎం రాజేశ్వరి

శ్రీకాళహస్తి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి, సేవాభావం, దేశభక్తి కలిగి, సమాజ సేవ చేయాలని జిల్లా కార్యాలయ కమిషనర్ టీ.రమేష్ బాబు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమ ప్రాధాన్యతను తెలిపే వాల్ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. రమేష్ బాబు మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నత పాఠశాల కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి వీ.శేఖర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్, కళాశాలలో రోవర్, రేంజర్ యూనిట్లను ప్రారంభించాలన్నారు. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం ఎంతగానో దోహదం పడుతుందని తెలిపారు. అందుకోసం పాఠశాలలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు స్కౌట్ మాస్టర్లు గైడ్ కెప్టెన్లుగా శిక్షణ తీసుకోవాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ శిక్షణ ద్వారా విద్యార్థులకు సేవాభావంతో పాటు క్రమశిక్షణ కూడా పెంపొందుతుందన్నారు. అనంతరం పెట్రోల్ లీడర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జిల్లా యూత్ చైర్మన్ ఎస్‌కే.అజారుద్దీన్, ధనుష్, గైడ్‌కెప్టెన్లు సులోచన పద్మావతి పాల్గొన్నారు.

జాతీయ విలువిద్య పోటీలకు విశ్వం విద్యార్థి


హేమన్స్ క్రితిక్‌ను అభినందిస్తున్న విశ్వనాథ్‌రెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి టి.హేమన్స్ క్రితిక్ జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 24న విజయవాడలో 6వ ఓపెన్ అండర్–10 రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో రికర్వ్ విభాగంలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆ విద్యార్థిని గురువారం ఆ పాఠశాల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి అభినందించారు.